క్లుప్తంగా

ప్రవచన కర్త చాగంటి జన్మదిన వేడుకలు



ధర్మారావు, సూర్యనారాయణను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆధ్మాతిక ప్రవచన కర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు స్థానిక శ్రీకృష్ణేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగాయి. జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చాగంటి పేరిట ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చేతివృత్తుల జిల్లా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ఆలయ చైర్మన్ దొమ్మేటి ధర్మారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ ధర్మారావు, ఘంటసాల పాటల గాయకుడు కందాళ సూర్యనారాయణలకు సత్కారాలు జరిగాయి. డాక్టర్ చాగంటి ఆధ్మాత్మిక ప్రసంగాల ఖ్యాతి గురించి వక్తలు వివరించారు. జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, వివిధ సంస్థల ప్రతినిధులు షేక్ కరిముల్లా, గోకరకొండ బలరామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పొన్నాడ జన్మదినం



కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జన్మదినం పురస్కరించుకొని పొన్నాడ కుటుంబ సభ్యులతో కలిసి పల్లిపాలెం శ్రీహరి సాకేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాల చెరువు గ్రాండ్ పార్క్‌లో అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వేద ఆశీర్వచనం

ఐ.పోలవరం: ఎమ్మెల్యే పొన్నాడకు మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ పండితులు వేద ఆశీర్వచనం చేశారు. శుక్రవారం అమలాపురం ఎమ్మెల్యే స్వగృహంలో పండితులు, అర్చకులు యనమండ్ర తేజ, ఉండి దత్తు, నాగాభట్ల రవిశర్మ తదితరులు ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనం చేశారు.

నీట్‌లో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం: మెడికల్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షా ఫలితాల్లో యానాం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు స్థానిక రీజెన్సీ కళాశాల విద్యార్థులు జి.లావణ్య-491, ఎం.శారద-400, వెంకటేష-394, అవినాష్-391, కడలి హాసిని-311, నాగలావణ్య-317, కోరుకొండ వినయకుమారి-305, కొప్పనాతి వెంకట్-289, కె.సత్య-278, కె.హేమ-259, ప్రణీత-255, రోహితేశ్వరి 190, పి.చందన-188, బి. భాగ్యరేఖ-151, లక్ష్మీ అఖిల-150 మార్కులు సాధించి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు.

వరదపై ముందస్తు చర్యలు

యానాం: గౌతమీ గోదావరికి వరద ముంపు ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి కోరారు. శుక్రవారం ఆర్ఏఓ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద గేట్ల పరిస్థితి, ఇసుక బస్తాలు సిద్ధం చేయడం , ఏటిగట్ల వద్ద బలహీనంగా ఉన్నచోట్ల పటిష్ట పరిచడం తదితర అంశాలపై మాట్లాడారు.

దోమలను నివారిద్దాం



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ నాగేంద్రమణి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి

అమలాపురం టౌన్: దోమలను నివారిద్దాం...డెంగీ జ్వరాలను అరికడదాం అనే నినాదంతో వైద్య సిబ్బంది అమలాపురం పుర వీధుల్లో శుక్రవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ నెలంతా డెంగీ నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో ఈ అవగాహన ర్యాలీ చేపట్టారు. మాసోత్సవాల్లో ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలన్న పిలుపుతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా డిపార్ట్‌మెంట్, స్థానిక మున్సిపాలిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సీహెచ్ భారతలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

అవస్థలు తీర్చిన సచివాలయ వ్యవస్థ



పాలగుమ్మిలో భూముల రిజిస్ట్రేషన్ చేస్తున్న కార్యదర్శి వెంకటలక్ష్మి



కామనగరువు సచివాలయం-2

- గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం
- 536 రకాల సేవలు అందుబాటులోకి
- 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పొందే అవకాశం

అమలాపురం రూరల్: గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూపొందించిన సచివాలయ వ్యవస్థ నాటి అవస్థలు, సమస్యలన్నింటినీ తీర్చుతూ ముందుకు సాగుతోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజలకు విశేషమైన సేవలందిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయం చేస్తూ సమస్త సేవలను వీటి ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం, 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. సచివాలయాల ద్వారా 536 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పొందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారుమూల ప్రాంతాల్లో సైతం సచివాలయ సేవలను పొందే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

ప్రజలకు చేరువగా పాలన

సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వం ప్రజలకు చేరువైంది. అమలాపురం మండలంలోని 22 గ్రామాల్లో 29 సచివాలయాలు నెలకొల్పగా 242 మంది ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులను నియమించారు. 29 మంది వ్యయసాయ అధికారులు, ఉద్యోగులను ప్రజల చెంతకే తీసుకొచ్చారు.

అమలాపురం రూరల్ మండలంలో ఇలా...

గ్రామ పంచాయతీలు	22
గ్రామ సచివాలయాలు	29
సచివాలయ ఉద్యోగులు	242 మంది
వలంటీర్లు:	489 మంది
గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది	నలుగురు
ప్రస్తుత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది	30 మంది
గత ప్రభుత్వంలో పంచాయతీలో ఉద్యోగులు	నలుగురు
వైఎస్ జగన్ ప్రభుత్వంలో సచివాలయంలో ఉద్యోగులు	11 మంది

1.4.2019 నుంచి ఇప్పటివరకు శాఖల వారీగా అందిన సేవలు

రెవెన్యూ	64,018
పంచాయతీరాజ్	1,589
పౌరసరఫరాల శాఖ	2,630
ఆధార్	4,904

మా గ్రామంలోనే భూమి రిజిస్ట్రేషన్



భూముల రిజిస్ట్రేషన్ కోసం అమలాపురంలో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామంలోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. 40 సెంట్ల భూమి కొనుగోలు చేశాను. సచివాలయంలో కార్యదర్శి చినవెంకటలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న ఒక్కరోజులోనే రిజిస్ట్రేషన్ చేశారు. రెండురోజుల్లో దస్తావేజులు అందించారు. దీనివల్ల సమయం , డబ్బు, ఆదా అయింది. పనులు త్వరగా పూర్తి చేయడంతో ఆనందంగా ఉంది.

– ఎం.కనకమహాలక్ష్మి, పాలగుమ్మి, అమలాపురం మండలం

గంటల వ్యవధిలో సర్టిఫికెట్



గ్రామ సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏ సర్టిఫికెట్ కావాలన్నా గంటల వ్యవధిలో ఇస్తున్నారు. నేను సచివాలయంలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్నా. అదే రోజు నాకు సర్టిఫికెట్ ఇచ్చారు. గతంలో ఇలా ఉండేది కాదు. మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. నేరుగా మా గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– చింతపల్లి వీరేంద్ర, విద్యార్థి, ఈదరపల్లి

ఘనంగా ఫ్రెంచ్ జాతీయ దినోత్సవం



వార్ మెమోరియల్ వద్ద జరిగిన ఫ్రెంచి జాతీయ దినోత్సవంలో పాల్గొన్న యానాం తదితర ప్రాంతాల ప్రతినిధులు

యానాం: ఫ్రెంచి జాతీయ దినోత్సవాన్ని(బాస్టిల్ డే) పుదుచ్చేరిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి వార్ మెమోరియల్ స్క్వేర్ వద్ద జరిగిన కార్యక్రమానికి యానాం నుంచి ఫ్రెంచిపౌరుల ప్రతినిధి సాధనాల బాబు హాజరయ్యారు. పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్, ఫ్రెంచి కాన్సిల్ జనరల్ మేడమ్ లైజ్ టాల్బట్, అసెంబ్లీ మెంబర్ క్రిస్టినా పాల్గొన్నారు. యానాంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఫ్రెంచి మిలటరీ అసోసియేషన్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. ఫ్రెంచి జాతీయ దినోత్సవ ప్రాధాన్యంపై పలువురు మాట్లాడారు. అనంతరం ఫ్రెంచి కాన్సులేట్‌లో ముఖ్య అతిథులకు విందు ఏర్పాటు చేశారు.

వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

అల్లవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం అయ్యేలా కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఇళ్లు, ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయుష్మాన్ సర్వే, విద్యార్థి సర్వే, ఎన్‌సీడీ సర్వేల ప్రగతిని ఎంపీడీఓ సమీక్షించారు. హౌసింగ్ ఏసీ సుబ్బారావు, ఏపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు వివిధ విభాగాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శాకంబరిగా వేపచెట్టు కనకదుర్గమ్మ



శాకంబరీదేవిగా దర్శనమిస్తున్న కల్వకొలనువీధి వేపచెట్టు కనకదుర్గమ్మ



తాళ్లరేవులో పూజలందుకున్న వాసవీమాత

అమలాపురం టౌన్: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక కల్వకొలను వీధిలో కొలువైన వేపచెట్టు కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరీదేవిగా శుక్రవారం అలంకరించారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. 1 నుంచి 7వ వార్డులకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ముమ్మిడివరంలో విజయదుర్గ

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధి పెద్ద వంతెన సమీపంలో గల విజయదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని అంగర విజయ రామాచార్యులు, నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. అనంతరం ఉచిత ప్రసాద వితరణ జరిగింది.

తాళ్లరేవులో వాసవీమాత

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ మాతకు శుక్రవారం శాకంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు అమ్మవారిని కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇందుపల్లిలో మావుళ్లమ్మ

అమలాపురం రూరల్: ఇందుపల్లిలో మావుళ్లమ్మ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం శాకంబరీదేవిగా విశేష అలంకారం చేశారు. పలు రకాల కురగాయలతో అమ్మవారిని అలకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాలికల వసతి గృహం పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ శుక్రవారం పరిశీలించారు. వసతులను, భోజన విధానాన్ని వార్డెన్ బి.తులసిని అడిగి తెలుసుకున్నారు. అన్నీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు.

బీసీ వసతి గృహం పునఃప్రారంభం

యానాం: యానాంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ బాలుర వసతి గృహాన్ని పునఃప్రారంభించినట్టు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి ప్రకటనలో తెలిపారు. యానాం రీజియన్ పరిధిలోని 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు వసతి గృహంలో చేరాలనుకుంటే తమ దరఖాస్తులను వెల్ఫేర్ ఆఫీసర్ చింతారామజోగికి అందజేయాలని కోరారు.

ఇంటి ఆడబిడ్డలా జాగ్రత్తలు చెబుతుంది

సంక్షేమ పందేరం

ఈమె పేరు కట్టా నాగదేవి. అమలాపురం మున్సిపాలిటీ 16వ వార్డులో వలంటీర్‌గా పనిచేస్తోంది. గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలు వివరిస్తూ తన పరిధిలోని 50 కుటుంబాల వారికి ఓ ఆత్మీయ బంధువు అయింది. ఇంటి ఆడబిడ్డలా ఆరోగ్యం అప్రమత్తత గురించి జాగ్రత్తలు చెబుతుంది. ఆ కుటుంబాలతో కలివిడిగా ఉంటుంది. ఆ ఇళ్లలో ఎవరికైనా ఒంట్లో బాగోలేకపోయినా ఆరోగ్య శ్రీ గురించి అవగాహన కల్పిస్తుంది. ఇక కరోనా సమయంలో ఆ కుటుంబాలను అప్రమత్తం చేసి ఆ వైరస్ బారిన పడకుండా తనకు తెలిసిన జాగ్రత్తలు చెప్పింది. ఇంటి ఆడబిడ్డలా ఓ కుటుంబ సభ్యురాలిగా వలంటీర్ నాగదేవి తన సేవల ద్వారా కలిసిపోయిందని ఆ 50 ఇళ్ల కుటుంబీకులు అంటున్నారు.



సత్యనారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగదేవి

నన్ను ఆదుకునే పింఛన్ డబ్బు చేతిలో పెడుతుంది



మా వలంటీర్ నాగదేవి మా ఇంటికి వచ్చి పింఛన్ తదితర సేవలు అందిస్తుంది. ఆ పింఛన్ డబ్బే నన్ను ఆదుకుంటోంది. ఆ డబ్బు కోసం ఎదురు చూసే నాకు ఒకటో తేదీ రాగానే వేలి ముద్ర వేయించుకుని డబ్బు ఇస్తుంది. కరోనా సమయంలో నాగదేవి మా ఇంటికి రోజూ వచ్చి ఆరోగ్య క్షేమాన్ని అడిగేది. ప్రతీ నెలా ఒకటో తేదీ రాగానే ఇంకా సరిగా తెల్లవారకుండానే మా ఇంటికి వచ్చి తలుపు తట్టి మరీ పింఛన్ ఇస్తోంది. ఓ కుటుంబ సభ్యురాలిలా నాతో కలసిపోయింది.

–పితాని సత్యనారాయణమ్మ, అమలాపురం

ఎమ్మెల్సీ కుడుపూడికి సత్కారం

కాకినాడ సిటీ: ఎమ్మెల్సీగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావును కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జంగా గగారిన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి


గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

యానాం: గౌతమీగోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్థానిక మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు చేర్చి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన మావూరి అప్పారావు యానాం -ఎదుర్లంక బ్రిడ్జిపై నుంచి దూకాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు అతనిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం బీట్ పోలీసు జగన్నాథం, హోమ్‌గార్డు జానకిరామ్ అతనిని అంబులెన్స్‌లో యానాం జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి వుందని పోలీసులు తెలిపారు.


నాలుగో రోజుకు కోపరేటివ్ సిబ్బంది దీక్షలు

యానాం: 30 నెలల బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యానాం కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది చేస్తున్న రిలే దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. మద్దతుగా స్థానిక బీజేపీ అధ్యక్షుడు కనకాల శ్రావణిరాజు, సబ్బతి లోకేష్, ఘాన్సీలక్ష్మీభాయి, అబ్బులు, వంగా వీరబాబు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మద్దతుదారులు రిలే దీక్షల్లో పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్ఏఓ మునిస్వామిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, పండు సిద్దార్థకుమార్, కనకాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ట్రిపుల్ ఐటీకి నలుగురి ఎంపిక




మంచెం శ్రావ్య



దాసరి రోషిత్



ఆకుల తులసి



కిరణ్‌వర్మ

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమైన మార్కులు సాధించి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం నూకల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎంపికైన మంచెం శ్రావ్య, ఆకుల తులసి, దాసరి రోషిత్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించి నగదు పురస్కారాలు అందించారు.

ఓడలరేవు విద్యార్థి ఎంపిక

అల్లవరం: ఓడలరేవు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 563 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన మల్లాడి కిరణ్‌వర్మ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి శుక్రవారం తెలిపారు.

అర్హులకు వరం...జగనన్న సురక్ష

తాళ్లరేవులో 741 మందికి ధ్రువీకరణ పత్రాల అందజేత

తాళ్లరేవు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరం వంటిదని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ధ్రువీకరణ పత్రాల వంటి వాటి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అధికారులే నేరుగా ప్రజల వద్దకే వచ్చి రూపాయి ఖర్చు లేకుండా ఆయా సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 741 మందికి ధ్రువపత్రాలు అందజేశారు.జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎన్.శంకరనారాయణ, సచివాలయ కార్యదర్శి టేకుమూడి వేణుగోపాల్ పాల్గొన్నారు.



తాళ్లరేవులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సునీత, ఏఎంసీ చైర్మన్ తదితరులు

జగనన్న సురక్ష ద్వారా 1,286 దరఖాస్తుల పరిష్కారం

అమలాపురం టౌన్: స్థానిక 13,14 వార్డు సచివాలయాల వద్ద జగనన్న సురక్ష శిబిరాలు శుక్రవారం జరిగాయి. ఈ రెండు సచివాలయాల వద్ద జరిగిన శిబిరాలకు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అధ్యక్షత వహించారు. ఈ శిబిరాల ద్వారా మొత్తం 1,286 దరఖాస్తులకు సంబంధించి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అతిథులుగా పాల్గొని దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. వార్డు కౌన్సిలర్లు బండారు గోవిందు, యండమూరి గంగ, చిత్రపు రామకృష్ణ, గోపీ రాజీ, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, సత్యశైలజ తదితరులు

అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ



అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అల్లవరం: అల్లవరం పోలీస్‌స్టేషన్‌ను బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ అంతా శుభ్రంగా ఉంచుకోవాలని, ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే రిసెప్షన్‌లో నమోదు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి, వాటి పనితీరుని గమనించారు. ఆయన వెంట సీఐ వీరబాబు, ఎస్సై శ్రీను నాయక్ ఉన్నారు.

గోరింటాకు పండగ


ఐ.పోలవరం: మండలంలోని పెదమడి సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ గంప్రోతు వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆషాఢంలో మాతృమూర్తులు అందరూ సంప్రదాయ బద్ధంగా ఆచరించే గోరింటాకు పండగ జరుపుకొన్నారు. మహిళలు మాట్లాడుతూ ఆషాఢంలో ఆడవాళ్లు గోరింటాకు పెట్టుకోవడం వలన శరీరంలో వేడి తొలగడటమే కాకుండా ఆరోగ్యానికి సంబంధించి అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. గాలిదేవర జయలక్ష్మి, దంగుడుబియ్యం సత్య, చింతలపూడి భవాని, ఎ.సత్య, డి.కోటమ్మ పాల్గొన్నారు.



సత్తెమ్మతల్లి ఆలయం వద్ద గోరింటాకు పెట్టుకొన్న మహిళలు

రామేశ్వరం మొగను తవ్వి ముంపు నివారణ చేపట్టాలి

అల్లవరం: ఇసుక మేటలతో నిండిపోయిన రామేశ్వరం మొగని తక్షణమే తవ్వి ముంపు నివారణ చర్యలు చేపట్టాలని డ్రెయిన్ అధికారులకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు సూచించారు. చైర్మన్ ఉండ్ర సుదర్శనరావు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. అల్లవరం ఆర్బీకేలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ షంషీ మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి వరి, అరటి, కొబ్బరి పంటలకు ఈ పంట నమోదు చేస్తారన్నారు. ఈ పంట నమోదు సంక్షేమ పథకాలకు ప్రామాణికమని తెలిపారు. అల్లవరంలో 865 మంది కౌలు రైతులకు సీసీఆర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు. ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ 1,800 ఎకరాల్లో నారుమళ్లు వేశారని తెలిపారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఎఫ్‌డీఓ హేమానంద్, పశు వైద్యాధికారి శివరామకృష్ణ, సలహా మండలి సభ్యులు చంద్రశేఖర్ , మొల్లేటి సత్యసాయిబాబు, రేవు సుందరరావు, కొపనాతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు,



సబ్సిడి విత్తనాలు రైతులకు అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు, ఏడీ షంషీ

వైభవంగా సుబ్బాలమ్మ జాతర

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మకు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించి బ్యాండ్ మేళాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషాల ప్రదర్శనలు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన నంద్యాల జిల్లా డోన్ శ్రీ శారద బ్యాండ్ మ్యూజిక్ ఈ జాతర మహోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 35 మంది కళాకారులతో సౌండ్ సిస్టమ్ (డీజేలు) లేకుండా సాగిన ఈ ప్రదర్శనను వేలాది మంది ప్రజలు ఆసక్తిగా తిలకించారు.